క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న మోక్షవిద్యయోగమందిర్ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకులు పట్టణంలోని శ్రీనివాస కాలనీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మోక్షవిద్య యోగమందిర్ అధ్యక్షుడు ఎస్.ధర్రాజు మాట్లాడుతూ భగవద్గీత పఠనం ప్రతీ భారతీయుని కర్తవ్యం కావాలనిచ అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భగవద్గీత చదవాల్సిన ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. మోక్షవిద్య యోగమందిర్ కార్యదర్శి డాక్టర్ ఆర్.కిశోర్, సలహాదారు టి.అప్పారావు, కోశాధికారి ఎన్.పెదకాపు, సభ్యులు ప్రసాద్, జగన్నాథరావు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం



108 శివలింగాలకు అభిషేకం చేస్తున్న వేదపండితుడు ఉమామహేశ్వరశర్మ

కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓ సదనం ఆశ్రమంలో వేదపండితులు అంపోలు ఉమా మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహాశివునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మార్గశిరమాస మహాశివరాత్రి సందర్భంగా 108 శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎస్ఐ మహేష్

బొండపల్లి: నూతర సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ యు.మహేష్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసెంబర్ 31 వ తేదీ రాత్రి దాబాలు, హోటళ్లలో నిర్వాహకులు మద్యం విక్రయాలు చేపట్టి,నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆరు బయట మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం



సోంపురం- ఆనందపురం రోడ్డు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

వేపాడ: మండలంలోని సోంపురం-ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణ పనులు గత ప్రభుత్వంలో చేపట్టారు. ఎన్నికల నోటిఫి కేషన్ రావడంతో రోడ్డు విస్తరణలో కొంతభాగం పనులు పూర్తికాలేదు. సోంపురం-ఆనందపురం రోడ్డులో గుంతలు పూడ్చాలని, రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఇటీవల కోరారు. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ఆదివారం గుంతలు పూడ్చే కార్యక్రమం ప్రారంభించారు. సోంపురం రోడ్డులో గుంతలు పూడ్చేందుకు జేసీబీనీ ఏర్పాటు చేసి పనులు చేశారు. కాలువల నిర్మాణం, రోడ్డు అభివృద్ధి పనులను జనవరి నెలలో తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ జేఈ స్వామి తెలిపారు.

హైందవ శంఖారావానికి ఆహ్వానం



ఎమ్మెల్యే లలితకుమారికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

లక్కవరపుకోట: వియజవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న హైందవ శంఖారావం మహాసభకు హాజరు కావాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఆహ్వానించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను ఆమె స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రం అంద జేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, దేవాలయ ట్రస్టుబోర్డుల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూడాలని, దేవాలయ పరిసరాల్లో దుకాణాలు హిందువులకే కేటాయించాలన్న డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు హైందవులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఆర్ఎస్ ఎస్ ప్రాంత ప్రచారక్ సీహెచ్.నర్సయ్య ,ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కోరుపోలు అప్పారావు,ఎం.గోవిందరావు పాల్గొన్నారు.

మండుతున్న.. వంట నూనెల ధరలు

- అయిదు నెలల్లో గరిష్టంగా పెరిగిన ధరలు
- 15 లీటర్ల నూనె డబ్బా ధర రూ.2,050 నుంచి రూ.2,250
- సంక్రాంతి ముందు మరో రూ.200 పెరిగే అవకాశం
- ఎన్నికల ముందు 15 లీటర్ల ధర రూ.1,500 నుంచి రూ.1,600
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విపరీతంగా పెరిగిన ధరలు

వంట నూనెల ధరల వివరాలు

వంట నూనె రకం	పరిమాణం	ధర
ఫ్రీడమ్	15 లీటర్లు	రూ.2,250
గోల్డ్ డ్రాప్	15 లీటర్లు	రూ.2,150
సన్‌డాట్	15 లీటర్లు	రూ.2,000
ప్రియాగోల్డ్	15 లీటర్లు	రూ.2,050
ఫ్రీడమ్	5 లీటర్లు	రూ.750
గోల్డ్ డ్రాప్	5 లీటర్లు	రూ.725



ఓ దుకాణంలో నిల్వ చేసిన వంట నూనె డబ్బాలు

చీపురుపల్లి: ఇటు రాష్ట్రంలోనూ అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న పార్టీలు కూటమిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితేనేం అనుకుంటున్నారా... నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ వాటిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి శ్రద్ధ కనబరచడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ధరల నియంత్రణపై వెనకడుగు వేస్తున్నాయి. రాష్ట్రంలో 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులతో పాటు వంట నూనెలు అన్నింటీ అదే దారి. ఎన్నికల ముందు వరకు ఉన్న ధరలకు తర్వాత ధరలకు తేడా చూస్తే వినియోగదారులకు కళ్లు బైర్లుకమ్ముతున్నాయి.వంట నూనెల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వంట నూనె పొయ్యి మీద పెట్టిన తర్వాత మండడం చూస్తుంటాం. కానీ కొద్ది రోజులుగా మార్కెట్‌కు వెళ్లి ధర వినేసరికే వినియోగదారులకు మంటపుట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని రకాల వంట నూనెల ధరలు గరిష్టస్థాయికి పెరిగాయి. సరిగ్గా అయిదారు నెలల క్రితం వరకు 15లీటర్ల నూనె డబ్బా ధర రూ.1,500 నుంచి రూ.1,600 వరకు ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమాంతంగా రూ.2 వేల నుంచి రూ.2,250 దాటేసింది.

మరో రూ.200 పెరిగే అవకాశం

మరో రెండు వారాల్లో సంక్రాంతి పండగ రానే వస్తోంది. ఈ పరిస్థితుల్లో వంట నూనె 15 లీటర్ల డబ్బాపై మరో రూ.200 పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. రష్యా నుంచి దిగుమతి అవుతున్న వంట నూనెపై 60 శాతం ట్యాక్స్ పెంచడమే దీనికి కారణమని వ్యాపారాలు చెబుతున్నారు. రెండు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వం కూడా వంట నూనెపై 24 శాతం ట్యాక్స్ పెంచేయడంతో ధరలు విపరీతంగా పెరిగిపోయినట్లు తెలుస్తోంది. ధరలు ఇంకా పెరిగితే సంక్రాంతికి పిండి వంటలు వండుకునే పరిస్థితి ఉండదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు ఉన్న ధరను ఎన్నికల తర్వాత అమాంతం పెంచేయడం దారుణమంటున్నారు.



ధరలు తగ్గించాలి...

వంట నూనెల ధరలు అమాంతం పెంచేశారు.ధరలు తగ్గించకపోతే పేదలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కనీసం పండగ సమయంలో కూడా నూనె కొనుగోలు చేసుకోలేని పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికే 15 లీటర్ల నూనె డబ్బా ధర రూ.2 వేలు దాటేసింది. పండగ సమయానికి మరింత పెరుగుతాయని చెబుతున్నారు. పెంచిన ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలి.



– మజ్జి శంకరరావు, రిక్షాకాలనీ, చీపురుపల్లి



బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న డాక్టర్ పేరి రామయ్య పంతులు



డాన్స్ చేస్తున్న చిన్నారులు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామ సమీపంలో వేపాడ పంచముఖ గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నేతృత్వంలో బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అతిథులుగా హాజరైన డాక్టర్ పేరి రామయ్య పంతులు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మేనేజర్ ఎం.వెంకట నర్సింహమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన బ్రాహ్మణ యువత అంతా బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యులకు 59 ఏళ్ల వరకూ బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. సొసైటీలో ఆర్‌డీ ఖాతాలతో పాటు అరుంధతి, వశిష్ట తదితర రుణాలను తక్కువ వడ్డీకి ఇస్తామన్నారు. బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ సంఘాలను బలోపేతం చేసుకోవడం ద్వారానే ఆర్థిక, సాంఘిక, సామాజిక హోదా సాధ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించి, సహపంక్తి భోజనాలు చేశారు.

సమ్మె మరింత ఉధృతం చేస్తాం..



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమణ

చీపురుపల్లి: నూతన వేతన ఒప్పందం అమలు చేసే వరకు సమ్మె కొనసాగించడమే కాకుండా మరింత ఉధృతం చేస్తామని వెంకట్రామా పాలిట్రీస్ పరిశ్రమ కార్మికులు, సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, ఏ.గౌరునాయుడు చెప్పారు. మండలంలోని కర్లాం వద్ద గల వెంకట్రామా పాలిట్రీస్ పరిశ్రమ వద్ద కార్మికులు మూడో రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ఆరు నెలలుగా కార్మికులు కోరుతున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అయినప్పటికీ కార్మికులు ప్రశాంత వాతావరణంలోనే నిరసన తెలిపారన్నారు. నూతన వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం మొండి వైఖరి అవలంబించడంతోనే నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సమ్మె మూడో రోజుకు చేరినప్పటికీ సమస్య పరిష్కరించకుండా అధిక సంఖ్యలో పోలీసులను రంగంలోకి దింపి కార్మికులను భయపెట్టాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. కార్మికుల ఐక్యత ముందు ఎలాంటి భయాలు ఉండవని స్పష్టం చేశారు.కార్మిక సంఘ నాయకులు ఐ.గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా న్యూఇయర్ వేడుకలు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ జయంతి

దత్తిరాజేరు: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని పెదమనాపురం ఎస్ఐ జయంతి మండల ప్రజలకు సూచించారు. పెదమనాపురం పోలీస్ స్టేషనలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 31న రాత్రి బహిరంగ ప్రదేశాలు, రోడ్లపూ వేడుకలు నిర్వహించరాదని, అర్ధరాత్రి తర్వాత యువత రోడ్లపై తిరగరాదన్నారు. అల్లర్లకు పాల్పడినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని విజయనగరం డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీఐ రామకృష్ణతో మాట్లాడుతూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు తీసుకున్న చర్యలపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, ఏఎస్సై మూర్తి, హెచ్‌సీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు



శృంగవరపుకోట: ఎస్.కోట ఎస్టీ బాలుర వసతి గృహంలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఆసంఘం మండల అధ్యక్షుడు జి.చైతన్య ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్య, అందరికీ ఉపా ధి అన్న నినాదంతో సుదీర్ఘ కాలంగా ఎస్ఎఫ్ఐ విద్యారంగసమస్యలపై అలు పెరుగని పోరాటం సాగిస్తోందని ఉద్ఘాటించారు. సంఘం మండల బాలికల విభాగం కన్వీనర్ ఎ.అనూ, జిల్లా జాయింట్ సెక్రటరీ కె.రాజు మాట్లాడుతూ 1970లో తిరువనంతపురంలో ఏర్పడ్డ భారత విద్యార్థి ఫెడరేషన్ 54 ఏళ్ల పోరాటాలు పూర్తి చేసుకుని 55వ వసంతంలోకి అడుగిడుతోందన్నారు. దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వం అని ప్రాణార్పణ చేసిన 8వ తరగతి విద్యార్థి నిరంజన్ తాలూక్‌దార్ స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేసేందుకు, సవాళ్లు ఎదుర్కొనేందుకు ఎస్ఎఫ్ఐ సిద్ధమవుతోందని చెప్పారు. మూసిన పాఠశాలలు, హాస్టల్స్‌ను పోరాటాల ద్వారానే తెరిపించామన్నారు.

కొత్తవలసలో...

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భదినోత్సవాన్ని ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షురాలు వి.భారతి ఆధ్వర్యంలో ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకు ముందు మండలంలోని పలు హాస్టళ్లను సందర్శించి ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు జి.చైతన్య, జి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక



శృంగవరపుకోట: ఎస్.కోట మండల బీజేపీ నూతన కార్యవర్గం

శృంగవరపుకోట: మండల బీజేపీ నూతన కార్యవర్గ ఎన్నికను ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాశెట్టి దాశరథి అధ్యక్షతన పట్టణంలో ఆదివారం నిర్వహించారు. మండల నూతన అధ్యక్షుడిగా మరిరా శ్రీనును, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆపార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగ ధానేష్, మండల ఎన్నికల అధికారి వారాది చిరంజీవి, పార్టీ ముఖ్య నాయకులు డి.సూర్యారావు, కె.ఎల్.రామకోటి, పాలకుర్తి అప్పారావు,బి.చంద్రశేఖర్, జి.బంగారు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోట అధ్యక్షుడిగా మోహన్‌రావు

లక్కవరపుకోట: బీజేపీ మండల అధ్యక్షుడిగా గొల్జాం గ్రామానికి చెందిన కోన మోహన్‌రావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆపార్టీ నియో జకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరంగ ధానేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఎన్నిక జరిగింది. ముందుగా పార్టీ క్రియాశీల సభ్యులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఆ పార్టీ నాయకులు దొడ్డి సూర్యారావు, కె.ఎల్.రామకోటి, బి.సత్యనారాయణ, వి.చిరంజీవి, చంద్రరావు పాల్గొన్నారు.

వేపాడ మండల అధ్యక్షుడిగా పవన్

వేపాడ: మండల బీజేపీ అధ్యక్షుడిగా వల్లంపూడి గ్రామానికి చెందిన లట్టాల పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరంగంర దానేష్,ఆర్‌ఓ కె.ఎల్.రామకోటి సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ నాయకులు డి.సూర్యారావు, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మామిడికి తుఫాన్ దెబ్బ

- వర్షాల వల్ల పూత పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం లేదంటున్న రైతులు
- అరకొరగా వచ్చిన పూత కూడా నిలవదని ఆందోళన



రోళ్లవాక వద్ద ఇంకా పూత రాని మామిడి తోట



అంబటివలస గ్రామ సమీపంలో అరకొరగా పూత వచ్చిన మామిడితోట

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లో మామిడి సాగు వివరాలు

మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
బొండపల్లి	6,000
గజపతినగరం	2,600
మెంటాడ	2,500
దత్తిరాజేరు	5,000

బొండపల్లి: అల్పపీడనం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు వరి, అపరాలు, మొక్కజొన్న, కూరగాయల పంటలకే కాకుండా మామిడి పంటకూ నష్టం కలిగించాయి. అదును తప్పి కురిసిన వర్షాల వల్ల వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులతో పాటు మామిడి రైతు కూడా కుదేలయ్యాడు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి,గజపతినగరం మండలాల్లో వరి తర్వాత మెట్టు భూముల్లో సాగు చేసే ప్రధాన పంట మామిడి. ఈనాలుగు మండలాల్లో 16వేల ఎకరాల్లో మామిడితోటలను సాగుచేస్తున్నారు. గత కొన్నేళ్లుగా మామిడి పంట దిగుబడులు అంత ఆశాజనకంగా లేవు. అదునుతప్పి కురుస్తున్న వర్షాలు, మంచు వల్ల పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. సాధారణంగా డిసెంబర్ నెల ప్రారంభంలో పణుకులు రకానికి చెందిన మామిడి ముందుగా పూతకు వస్తుంటుంది. మార్చి నెల వచ్చేసరికి పంట కోతకు వస్తుంటుంది. మిగతా రకాలు డిసెంబర్ మూడో వారం నుంచి పూతకు వచ్చి జూన్ నెలాఖరు నాటికి పంట కోతకు వస్తాయి. అయితే డిసెంబర్ నెలాఖరు అయినా ఇంత వరకు అక్కడక్కడా పణుకులు రకం తప్ప మిగతా రకాలు పూతకు రాలేదు. పగటి పూట వేడి వాతావరణం, రాత్రి పూట చల్లని వాతావరణం ఉంటే పూత బాగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఈ ఏడాది డిసెంబర్ నెలలో వాతావ రణం వర్షాకాలాన్ని తలపించింది. ఈనెల మొదటి వారంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురవగా, తాజాగా పదిరోజుల పాటు ముసురు పెట్టడంతో మామిడి పూతకు వాతావరణం అనుకూలించలేదు.వర్షాల వల్ల పూత రాకపోగా ముందే అక్కడక్కడా అరకొరగా వచ్చిన పూత సైతం నిలవదని రైతులు వాపోతున్నారు. వర్షాలు ఆగిన రెండు వారాల తర్వాత పూతతో పాటు ఆకులు కూడా నల్లగా మాడిపోయే అవకాశాలు ఉంటాయని రైతులు అంటున్నారు. తోటల్లో నీరు నిలిచిపోవడంతో భూమిలో తేమశాతం పెరుగుతుందని, దిగుబడులపై తేమ ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పూత రాలిపోయే అవకాశం



అల్పపీడనం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇప్పటికే వచ్చిన మామిడి పూత రాలి పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా మామిడి పంటకు రాత్రి పూట చల్లని వాతావరణం, పగటి పూట వేడి వాతావరణం ఎక్కువగా ఉంటే పూత ఆశాజనకంగా వస్తుంది. అలాగే తేనె మంచు వల్ల కూడా పూత రాలిపోయే అవకాశం ఉంది. పిందె దశలో వర్షాలు కురిస్తే పంటకు మేలు. పూత దశలో వర్షాలు పంటకు చేటు చేస్తాయి. – కె.రాజశేఖర్, గజపతినగరం సబ్ డివిజన్ హెచ్‌ఓ

నష్టం తప్పేలా లేదు



ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరి, అపరాలు, ఇతర పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారు. ఈవర్షాల వల్ల మామిడి పంటకూ నష్టం తప్పేలా లేదు.తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు పూత వచ్చే అవకాశాలు తక్కువ. గత ప్రభుత్వంలో మామిడి పంటకు ఉచితంగా బీమా చేయించడం వల్ల పంటదెబ్బతింటే పరిహారం అందేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులే ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని చెబుతోంది. ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించకపోగా, బీమా భారం కూడా మాపైనే వేయడం సబబు కాదు. – కెల్ల గోపాలరావు, రైతు, రోళ్లవాక గ్రామం, బొండపల్లి మండలం

• హరిదాసుల సందడి..



గ్రామాల్లో హరిదాసుల సందడి నెలకొంది. నెలగంటు పెట్టినప్పటి నుంచి హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ గ్రామాల్లో సందడి చేస్తుండడంతో మహిళలు బియ్యంను స్వామివార్లకు సమర్పించుకుంటున్నారు. ద్వారపూడిలో ఓ హరిదాసు సందడి చేయడం శనివారం సాక్షి కంటపడింది.

– విజయనగరం రూరల్

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా రాము

దత్తిరాజేరు: తిమిటేరు గ్రామానికి చెందిన చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు ముడిదాపు రాము జిల్లా మానటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఈమేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్వర్వులు అందాయని ఆదివారం ఆయన విలేకరులకు చెప్పారు. చేయూత ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవకాశం కల్పించిన అధికారులకు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.